సాక్షి
కర్నూలు

శుక్రవారం ၊ 1 ၊ ఆగస్టు ၊ 2025




ఊపిరిపై క్యాన్సర్ కాటు

బీడీ, సిగరెట్ అలవాటు క్యాన్సర్‌గా మారి మనిషి ప్రాణాలు తీస్తోంది. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రతిరోజూ ఓపీకి 30 మంది దాకా క్యాన్సర్ రోగులు వస్తున్నారు. 8లో▸



పొలానికి వెళ్లి.. నాట్లు వేసి

ఉయ్యాలవాడ మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం పొలం బాట పట్టారు. వరి నాట్లు వేశారు. వ్యవసాయ విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.83
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:75.934
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:52,878
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:51,317

న్యూస్‌రీల్

స్వర్ణ పల్లకీలో దివ్య తేజం



బంగారు పల్లకీ సేవలో అర్చకులు, భక్తులు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో గురువారం స్వర్ణ పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. తొలుత ఊంజల మంటపంలో సేవా భక్తులతో సంకల్పం చేయించి చామర్ల సేవ చేపట్టారు. అనంతరం స్వర్ణ పల్లకీలో శ్రీరాఘవేంద్రుల ప్రతిమను కొలువుంచి హారతులు పట్టారు. శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో అశేష భక్తజన వాహిని మధ్య పల్లకీ సేవ నిర్వహించారు.

పది పంపులతో హంద్రీనీవాకు నీరు



కాలువలోకి నీటి పంపింగ్ దృశ్యం

కర్నూలు సిటీ: రాయలసీమ జిల్లాల్లో సాగు, తాగు నీటిని అందించేందుకు చేపట్టిన హంద్రీ నీవా సుజల స్రవంతి పథకానికి భారీగా నీటిని ఎత్తిపోస్తుండడంతో కాల్వ నిండుగా ప్రవహిస్తోంది. ఇప్పటి వరకు 9 పంపుల ద్వారా నీటిని పంపింగ్ చేసిన ఇంజనీర్లు గురువారం రెండో పంపింగ్ స్టేషన్‌లో 10వ పంపును సైతం ఆన్ చేశారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం, విస్తరణ పనులు చేసిన తరువాత కాల్వ భద్రతను దృష్టిలో పెట్టుకొని హంద్రీనీవా ఇంజనీర్లు పర్యవేక్షణను పెంచారు. ఎప్పటికప్పుడు నీటి ప్రవాహన్ని పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలను తక్కువ రోజుల్లో ఎక్కువ నీటిని తీసుకునేలా ప్రధాన కాలువను విస్తరించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ ఫలితాలు ఇప్పుడు ప్రజలకు చేరువవుతున్నాయి. జిల్లాలో కృష్ణగిరి రిజర్వాయర్, అనంతపురం జిల్లాలోని జీడీపల్లి రిజర్వాయర్ నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో నీటిని పెన్నహోబిళం రిజర్వాయర్‌కు మళ్లిస్తున్నారు. అదే విధంగా కాలువలో నీటి ప్రవాహం ఉండడంతో 68 చెరువుల పథకానికి, 110 కి.మీ దగ్గర హంద్రీ నీవా ప్రధాన కాలువకు ఏర్పాటు చేసిన స్లూయిజ్ నుంచి గాజులదిన్నె ప్రాజెక్టుకు సైతం నీటిని విడుదల చేస్తుండటం విశేషం.

నేడు పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఆగస్టు నెల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మొదలవనుంది. రెండు నెలలుగా ఊరిస్తున్న స్పౌస్ పింఛన్లు కూడా పంపిణీ చేసే అవకాశం ఉంది. అరియర్స్ కింద జూన్, జులై నెల పింఛన్లు ఆగస్టు నెలతో కలిపి పంపిణీ చేస్తారని ఆశించిన మహిళలకు నిరాశే మిగులుతోంది. స్పౌస్ పింఛన్లు కర్నూలు జిల్లాలో 3,527, నంద్యాల జిల్లాలో 3,630 పంపిణీ చేయనున్నారు. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటూ మరణించిన భర్తల స్థానంలో వారి భార్యలకు వితంతు పింఛన్ మంజూరు చేసింది. కర్నూలు జిల్లాలో మొత్తం 2,39,491, నంద్యాల జిల్లాలో 2,15,708 పింఛన్లు పంపిణీ చేయనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలవుతున్నా కొత్త పింఛన్ ఒక్కటీ లేకపోవడం గమనార్హం.

మహిళ ప్రాణం తీసిన ఆర్‌ఎంపీ వైద్యం

- అబార్షన్ చేయడంతో తీవ్ర రక్తస్రావం



మృతి చెందిన శ్రీవాణి

నందికొట్కూరు: అనుభవం లేకుండా అనాలోచితంగా ఆర్‌ఎంపీ చేసిన వైద్యం ఒక మహిళ ప్రాణం తీసింది. ఈ ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముచ్చుమర్రి పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు.. గడివేముల మండలంలోని గని గ్రామానికి చెందిన శివమ్మ కూమార్తె శ్రీవాణికి ఈ నెల 28వ తేదీన నందికొట్కూరు పట్టణంలోని గీతారాణి ఆర్‌ఎంపీ వద్ద శ్రీవాణి అబార్షన్ చేయించారు. అనంతరం 29వ తేదీన పగిడ్యాల మండలం బీరవోలు గ్రామానికి వెళ్లారు. శ్రీవాణికి తీవ్ర రక్తస్రావం కావడంతో 30వ తేదీన బుధవారం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు కుటుంబ సభ్యులు తరలించారు. వైద్యులు చూసి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. రూరల్ సీఐ సుబ్రమణ్యం సంఘటనపై విచారణ చేపట్టారు.

- జిల్లాలో రూ.133 కోట్ల 'ఫీజు' పెండింగ్
- 2023-24 ఏడాది పెండింగ్‌ను క్లియర్ చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఎస్టీ ఇంజినీరింగ్ విద్యార్థుల ఫీజు బుకాయింపు
- ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాల ఒత్తిడి
- ప్రశ్నార్థకంగా మారిన పేద విద్యార్థుల ఉన్నత విద్య



ఫీజు భారమై.. ఉన్నత విద్యకు దూరమై!

పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఎలాంటి ఆటంకం కల్పించబోమని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు చెల్లిస్తామని మాట ఇచ్చారు. మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులకు అండగా ఉంటాని వాగ్దానం చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాటను మరిచారు. గడిచిన విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజు (మొత్తం ఆరు క్వార్టర్లు) బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

కర్నూలు(అర్బన్): వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో నిశ్చింతగా ఉన్న విద్యా రంగం కూటమి ప్రభుత్వంలో అతలాకుతలం అవుతోంది. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆలవాలంగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు చంద్రబాబు ప్రభుత్వం ఆటంకం కల్పిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు విడుదల చేయాల్సిన ఫీజు బకాయిలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులను పీడిస్తున్నాయి. చాలా మంది పేద విద్యార్థులు ఫీజు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు.

పెండింగ్‌లో మూడు క్వార్టర్ల ఫీజు

ప్రతి విద్యా సంవత్సరంలో నాలుగు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అదే ఏడాది మార్చి 2న మొదటి విడతగా జిల్లాలోని 35,618 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి రూ.23.95 కోట్లను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జమ చేసింది. అంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలిన మూడు విడతల ఫీజును ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు చెల్లించాల్సిన మూడు క్వార్టర్ల ఫీజును పెండింగ్‌లో పెట్టింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పెంచిన ఘనత వైఎస్ జగన్‌దే

గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టిన సమయంలో బీసీ, ఈబీసీ, మైనారిటీ, కాపు విద్యార్థుల ఇంజినీరింగ్ విద్యకు ఏడాదికి రూ.35 వేలు మాత్రమే విడుదలయ్యేవి. కానీ, కొన్ని పెద్ద కళాశాలల్లో (గ్రేడ్ -1) ఇంజినీరింగ్ ఫీజు ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఉంది. ఆయా కళాశాలల్లో చదువుతున్న సంబంధిత సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసే రూ.35 వేలను మినహాయించి మిగిలిన ఫీజు వారి తల్లిదండ్రులే చెల్లించాల్సి వచ్చేది. ఈ ఆర్థిక భారాన్ని కూడా తొలగించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని పెంచారు. దీంతో గ్రేడ్-1 కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని కూడా తగ్గించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కింది.

రూ.133.17 కోట్ల బకాయిలు

జిల్లాలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి దాదాపు రూ.133.17 కోట్లు పెండింగ్‌లో పడ్డాయి. 2023-24కు సంబంధించి 31,596 మంది విద్యార్థులకు మూడు నెలలకు రూ.61,86,61,526 కాగా, 2024-25 విద్యా సంవత్సరానికి 32,736 మంది విద్యార్థులకు ఇప్పటి వరకు దాదాపు రూ.71,31,06,554లను ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సి ఉంది. కాగా ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్న ఎస్టీ విద్యార్థులకు మొత్తం ఫీజును చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ చెల్లించకపోవడం శోచనీయం.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

2017-18, 2018-19 విద్యా సంవత్సరాల్లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019-20 విద్యా సంవత్సరంలో విడుదల చేసింది. అప్పట్లో జిల్లాలో 32,162 మంది విద్యార్థులకు సంబంధించిన అరియర్స్‌ను వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే కుటుంబ వార్షిక ఆదాయాన్ని కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. లక్షగా నిర్ధారిస్తే, వీలైనంత ఎక్కువ మందికి ప్రయోజనం చేకూరాలనే సదుద్దేశంతో జగన్ ప్రభుత్వం రూ.2.50 లక్షలకు పెంచింది. ఈ నేపథ్యంలోనే వసతి దీవెన పథకం ద్వారా ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు రూ.20 వేల ప్రకారం అందించింది.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆరు నెలలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పెండింగ్‌లో ఉంచడంతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఫీజు బకాయిలను విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడతాం.

– కటికె గౌతమ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, రాష్ట్ర అధికార ప్రతినిధి

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఫీజులను చెల్లించకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాయి. ఫీజు గురించి విద్యార్థులను ప్రశ్నించకుండా కళాశాల యాజమాన్యాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. ఫీజుకు సంబంధించి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగితే అందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంది.

– కాసారపు వెంకటేష్, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఐదేళ్లలో రూ.501.60 కోట్లు విడుదల

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ తదితర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన కింద రూ.501.60 కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశారు.



దేవాలయం వద్ద భక్తుల రద్దీ

ఈరన్నస్వామి క్షేత్రం.. భక్తజన సంద్రం



వెండి అలంకరణలో ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా మొదటి గురువారం భక్తుల రద్దీ కొనసాగింది. శ్రావణమాస ఉత్సవాల మొదటి గురువారం కావడంతో భక్తులు ఉదయం నుంచే స్వామి దర్శనానికి తరలిరావడంతో పుణ్యక్షేత్రం భక్త జనసంద్రంగా దర్శనమిచ్చింది. భక్తులు ఆలయ పరిసరాల్లో ప్రత్యేక వంటకాలను వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, బిందుసేవ, పంచామృతాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. స్వామి దర్శనం కోసం భక్తులు గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అతిశీఘ్ర దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం ఏర్పాటు చేశారు.

రేషన్‌లో కందిపప్పు లేనట్లే..

నంద్యాల(అర్బన్): పేదలకు చౌక దుకాణాల ద్వారా సబ్సిడీపై కందిపప్పు ఈ నెల కూడా అందే పరిస్థితులు కనిపించడం లేదు. జిల్లాలో 5.41 లక్షల మంది కార్డు దారులకు 1,204 రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. ఆగస్టు నెలకు సంబంధించి 7,341 టన్నుల బియ్యం, 815 టన్నుల జొన్నలు, 241 టన్నుల చక్కెరను కార్డు దారులకు నేటి(శుక్రవారం) నుంచి అందించనున్నట్లు సివిల్ సప్లయ్ డీఎం అశ్వర్థనారాయణ నాయక్ తెలిపారు. అయితే కందిపప్పు అందిస్తామని చెప్పలేదు. ఒక్కో కార్డు దారునికి ఒక కేజీ చొప్పున కందిపప్పు అందించాల్సి ఉంది. జిల్లాలో గత పది నెలలుగా అందించడం లేదు. కార్డుదారులు బయటి మార్కెట్‌లో అధిక ధరతో కొనలేక ఇబ్బంది పడుతున్నారు.

ఎలాగైనా నన్ను బతికించండి మేడం!

- నా భార్యాబిడ్డలను చూపించండి
- వైద్యులను వేడుకుంటున్న బాధితుడు

కర్నూలు(హాస్పిటల్): 'నా భార్యా పిల్లలను చూడాలని ఉంది. వారు ఎక్కడున్నారో తెలుసుకుని నాకు చూపించండి.. నాకు బ్రతకాలని ఉంది.. ఎలాగైనా నన్ను బతికించండి మేడం' అంటూ పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్. చిన్నబాలయ్య వైద్యులను వేడుకుంటున్న దృశ్యం అందరినీ కలిచివేస్తోంది. వైఎస్ఆర్ కడప జిల్లా కొండాపురం మండలం బుక్కపట్నం గ్రామానికి చెందిన ఆర్. చిన్నబాలయ్య(45) స్థల వివాదం విషయంలో పోలీసులు వేదిస్తుండటంతో తట్టుకోలేక బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా అక్కడ ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అదే రోజు రాత్రి తీసుకొచ్చారు. ఆయనను ఆసుపత్రిలోని కాలిన రోగుల విభాగంలో ఉంచి వైద్యులు చికిత్స చేస్తున్నారు. 60 శాతం కాలిన గాయాలు ఉన్నాయని, ముఖ్యంగా పెట్రోల్ పోసుకోవడం వల్ల ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయని, అందులో నీరు చేరుతోందని వైద్యులు గుర్తించారు. గురువారం అతని క్రియాటినిన్ లెవెల్స్ కూడా పెరగడంతో పాటు ఇంకా షాక్‌లో ఉన్నాడు. వైద్యులు ఆయన వద్దకు వచ్చినప్పుడల్లా సార్ నన్ను బ్రతికించండి... నాకు బ్రతకాలనుంది అంటూ వేడుకుంటున్నాడు. తనను హోంగార్డులు తిరుపతయ్య, నాగార్జునరెడ్డి, కానిస్టేబుల్ నరసింహులుతో పాటు గ్రామస్తులు దత్తాపురం మాధవరెడ్డి, గంగిరెడ్డి వేదిస్తున్నారని, తన భార్య, పిల్లలను నాకు చూపించకుండా ఎక్కడో దాచి పెట్టారని, తనపై తప్పుడు కేసులు పెట్టి వేదిస్తున్నారని, అందుకే తట్టుకోలేక పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని, ఇప్పుడు నా భార్యాపిల్లలను చూడాలని ఉంది.. చూపించండి అంటూ ప్రాదేయపడుతున్నాడు. ఎవరు వెళ్లినా ఆయన పదే పదే ఇవే మాటలు చెబుతుండటంతో వైద్యులు, సిబ్బంది చలించిపోతున్నారు. బుధవారం కంటే గురువారం నాటికి ఆయన పరిస్థితి మెరుగుపడినా 60 శాతం కాలిన గాయాలు ఉండటంతో పూర్తిగా కోలుకునే వరకు పరిస్థితి చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు.

రోజంతా సర్వర్ సమస్యే!

- ఫసల్ బీమాకు దూరమైన రైతులు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు తిలోదకాలు ఇవ్వడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద నోటిపై చేసిన వివిధ పంటలకు ప్రీమియం చెల్లించేందుకు గురువారం చివరి రోజు కావడంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగింది. కంది, జొన్న, సజ్జ తదితర పంటలకు ప్రీమియం చెల్లించేందుకు రైతులు ముందుకొచ్చారు. ప్రీమియం చెల్లించాలంటే రైతు సేవ కేంద్రం నుంచి పంట సాగు చేసినట్లు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అయితే సర్వర్ సమస్యతో రైతులు సర్టిఫికెట్ పొందలేకపోయారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సమస్య ఏర్పడటంతో రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వచ్చింది. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. అక్కడక్కడ షోయింగ్ సర్టిఫికెట్ అప్‌లోడ్ అయినప్పటికీ ప్రీమియం చెల్లించేందుకు కూడా సర్వర్ సమస్య తలెత్తింది. సాంకేతిక సమస్యల వల్ల సర్వర్ ప్రాబ్లం వచ్చినట్లు తెలుస్తోంది. పరిష్కారానికి వ్యవసాయ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు ఫసల్ బీమా చేయించుకోలేకపోయారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ-క్రాప్‌లో నోటిఫైడ్ పంట సాగు చేసినట్లు నమోదైతే చాలు ఉచిత పంటల బీమా వర్తించింది. చంద్రబాబు ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు తిలోదకాలు ఇచ్చి ప్రీమియం చెల్లించే విధానాన్ని తీసుకువచ్చింది.

పరిశ్రమల స్థాపనకు గడువులోపు అనుమతులు



హాజరైన అధికారులు, పరిశ్రమల యజమానులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పరిశ్రమల స్థాపనకు వీలుగా ఆయా శాఖలు నిర్దేశించిన గడువులోపు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్టు ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్కు పోర్టల్ ద్వారా మే 30 నుంచి జూలై 30వ తేదీ వరకు 870 పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు రాగా 858 దరఖాస్తులను ఆమోదించామన్నారు. పీఎం విశ్వకర్మకు సంబంధించి 1,234 దరఖాస్తులు రాగా, 989 యూనిట్లకు రుణాలు మంజూరైనట్లు చెప్పారు. ఉత్పత్తిలోకి వచ్చిన కొత్త పరిశ్రమలు ప్రభుత్వానికి ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు ఇస్తున్నారా లేదా అని ఏపీఐఐసీ జెడ్ఎం, పరిశ్రమల శాఖ జీఎంలను ఆరా తీశారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లెతై బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రూ.26.22 లక్షల పారిశ్రామిక రాయితీ విడుదలకు ఆమోదం తెలిపారు. పేదరిక నిర్మూలన(పీ4)లో పరిశ్రమల యాజమాన్యాలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 73 పంచాయతీల్లో గ్రామ సభలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎంపిక చేసిన 73 గ్రామ పంచాయతీల్లో ఆంధ్రప్రదేశ్ సర్వే ప్రాజెక్టు/స్వామిత్వ అమలుకు సంబంధించి ఈ నెల 1వ తేదీ నుంచి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్-2 ప్రక్రియ అమల్లో భాగంగా ఫీల్డ్ లెవెల్ టీం (పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, వీఆర్ఓ) ఈ సభలను నిర్వహిస్తుందన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో యుద్ధ ప్రాతిపదికన స్వామిత్వకు సంబంధించి గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాల్యూడేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో ఆస్తి యజమానులకు ప్రాపర్టీ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ 74 గ్రామ పంచాయతీల్లో పూర్తయిందని, ఫేజ్-1 ప్రక్రియలో భాగంగా 13 గ్రామ పంచాయతీల్లో గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వాల్యూడేషన్ జరుగుతున్నదని డీపీఓ పేర్కొన్నారు.

ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్

- రైతు వద్ద రూ.40వేల లంచం డిమాండ్
- ఆర్డీఓ చెప్పినందుకే తీసుకున్నట్లు సీనియర్ అసిస్టెంట్ వెల్లడి



ఏసీబీకి పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ రమేష్

జూపాడుబంగ్లా: రైతు నుంచి రూ.40వేల లంచం తీసుకుంటూ ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ సోమన్న, బాధిత రైతు ఈశ్వరయ్య తెలిపిన వివరాలివీ.. జూపాడుబంగ్లాకు చెందిన శంకరమ్మకు 80బన్నూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 568/ఏలో 0.70 సెంట్లు, 568/సీలో 0.30సెంట్ల పొలం ఉంది. వీరు ఈ పొలాన్ని పూర్వం నుంచి అనుభవిస్తున్నారు. అయితే ఆన్‌లైన్ అడంగల్‌లో రెవెన్యూ అధికారులు జూపాడుబంగ్లాకు చెందిన లింగన్న పేరిట నమోదు చేశారు. తమకు వారసత్వంగా వస్తున్న రిజిష్టర్ భూమిని తిరిగి తమ పేరిట ఎక్కించాలని రైతు ఈశ్వరయ్య 2021 నుంచి జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్ఓఆర్ విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయానికి రెఫర్ చేశారు. అయితే పేరును చేర్చేందుకు రూ.70వేలు లంచం డిమాండ్ చేశారు. తాను అంత మొత్తం ఇచ్చుకోలేనని రూ.30వేలు ఇస్తానని పేర్కొన్నట్లు బాధిత రైతు తెలిపాడు. చివరికి రూ.50వేలకు బేరం కుదిరింది. అందులో భాగంగా రూ.10వేల అడ్వాన్స్‌ను ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు ఇచ్చాడు. మిగిలిన రూ.40వేల నగదు రైతు ఈశ్వరయ్య వద్ద తీసుకొని తనకు ఇవ్వాలని ఆర్డీఓ ఆదేశించినట్లు ఏసీబీకి పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ రమేష్ ఏసీబీ అధికారులకు తెలిపాడు. రమేష్ ఒత్తిడి తాళలేక రైతు కర్నూలు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

వల పన్నిన ఏసీబీ

ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు గురువారం ఈశ్వరయ్యకు రూ.40వేల నగదు ఇచ్చి పంపించారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న సూచనల మేరకు రైతు ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు గురువారం ఫోన్‌చేసి డబ్బులు ఎక్కడకు తెచ్చిమ్మంటారని అడిగాడు. అందుకాయన తాను నందికొట్కూరు నుంచి ఏపీ 40 డీపీ 5036 నెంబర్ కారులో ఆత్మకూరుకు వెళ్తున్నానని, జూపాడుబంగ్లాకు వచ్చిన తర్వాత డబ్బులు తీసుకొంటానన్నాడు. జూపాడుబంగ్లా జంగాల పెద్దన్న ఇంటికి సమీపంలో ఈశ్వరయ్య వేచి చూస్తుండగా అక్కడకు కారులో వచ్చిన రమేష్ రైతు ఇచ్చిన రూ.40వేల నగదును తీసుకొని ఆత్మకూరుకు బయలుదేరాడు. డబ్బులు ఇచ్చిన వెంటనే ఈశ్వరయ్య ఏసీబీ అధికారులకు ఫోన్‌చేయటంతో వారు జూపాడుబంగ్లా బస్టాండు వద్ద రమేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అతని నుంచి రూ.40వేల నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేశారు.

ఆర్డీఓ ఒత్తిడితోనే...

ఏసీబీకి పట్టుబడిన రమేష్ మాట్లాడుతూ.. రైతు ఈశ్వరయ్య వద్ద డబ్బులు ఇప్పించుకొని రావాలని ఆర్డీఓ నాగజ్యోతి ఒత్తిడి చేయటంతో తాను డబ్బు తీసుకొన్నానని తెలిపాడు. లంచం ఇస్తేనే పని చేస్తానని రైతు ఈశ్వరయ్యపై ఆర్డీఓ ఒత్తిడి చేయటం వల్లే తానే ఏసీబీ వద్దకు వెళ్లాలని రైతుకు సలహా ఇచ్చినట్లు పేర్కొనటం గమనార్హం. ఇదిలాఉంటే ఆర్డీఓ విషయమై ఏసీబీ డీఎస్పీ సోమన్నను 'సాక్షి' ప్రశ్నించగా.. ఆర్డీఓ స్వయంగా లంచం డిమాండ్ చేసినట్లు తగిన ఆధారాలు లేవన్నారు. అందువల్ల ఆమెపై కేసు నమోదు చేయడం లేదని తెలిపారు.

క్లుప్తంగా

ప్రమాదం వేలాడుతోంది



సర్వీస్ వైరు ఊడిపోవడంతో ఆటోపై నిలబడి మరమ్మతులు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

పత్తికొండ: నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం. అక్కడే ప్రమాదం మాటు వేసింది. కిందకు వేలాడుతూ భయపెడుతోంది. వెలుగులు ప్రవహించే విద్యుత్ తీగలు చీకట్లు నింపే ప్రమాదం నెలకొంది. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉందని కనిపిస్తున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. పత్తికొండ పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఇరువైపుల ఏర్పాటు చేసిన సర్వీస్ విద్యుత్ తీగలు చాలా ప్రమాదకరంగా మారాయి. వాహనాలకు తగిలే అంత ఎత్తులో ఉండటంతో ఏదో ఒక చోట తొగి కింద పడుతున్నాయి. త్రుటిలో ప్రజలు ప్రాణాలతో బయటపడుతున్నారు. గురువారం గుత్తిరోడ్డు సర్కిల్‌లో భారీ వాహనం తాకడంతో సర్వీస్ వైరు కిందికి పడిపోయింది. స్థానికులు విద్యుత్ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో ట్రాన్స్‌కో సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై ఆటోనే ఆసారాగా చేసుకుని 45 నిమిషాలు పాటు ట్రాఫిక్ నిలిపివేసి తీగలను సరి చేశారు. దీంతో ఇరు వైపులా వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు.

ఆర్‌సీడీఎస్ రీజినల్ కోఆర్డినేటర్‌గా మండ్ల వెంకటసుబ్బారెడ్డి



కర్నూలు(అర్బన్): రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌సీడీఎస్) రీజినల్ కోఆర్డినేటర్(కర్నూలు, నంద్యాల, ప్రకాశం)గా బనగాన పల్లెకు చెందిన డాక్టర్ మండ్ల వెంకటసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి గురువారం నియామక పత్రాన్ని జారీ చేశారు. రెడ్డి జాతి శ్రేయస్సు, ఐక్యతకు పాటు పాడేందుకు గత జూలై 30వ తేది నుంచి తదు పరి ఉత్తర్వులు అందే వరకు మండ్ల వెంకట సుబ్బారెడ్డి రీజినల్ కోఆర్డినేటర్‌గా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే సొసై టీ నియమ నిబంధనలను అనుసరించి క్రమ శిక్షణతో అన్ని రెడ్డి సంఘాలను సమన్వయం చేసుకొని విధులు నిర్వహించాలన్నారు.

2న చిత్రలేఖన పోటీలు

కర్నూలు కల్చరల్: జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభల సందర్భంగా ఈనెల 2వ తేదీ ఉదయం 10 గంటలకు ఓల్డ్‌బస్టాండ్ సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు జేవీవీ జిల్లా కమిటీ సభ్యులు తెలిపారు. సీనియర్ విభాగంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం', జూనియర్ విభాగంలో 6, 7 తరగతుల విద్యార్థులకు 'మొక్కల సంరక్షణ' అనే అంశాలపై పోటీలు ఉంటాయని వెల్లడించారు.

రేపు అట్యా-పాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): పాణ్యం పట్టణంలోని విజయానికేతన్ పాఠశాల క్రీడా మైదానంలో ఆగస్టు 2న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-15 బాలుర విభాగంలో అట్యా- పాట్యా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరత్నమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు వచ్చే నెల 8 నుంచి 10 వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఊపిరిపై క్యాన్సర్ కాటు

- పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు
- ధూమపానమే ప్రధాన కారణం
- వాతావరణ కాలుష్యం కూడా..
- నేడు ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం

పొగతాగడం ఆరోగ్యానికి హానికరం. ఇది క్యాన్సర్ కారకం.. అని బీడీ, సిగరెట్, చుట్టల పెట్టెలపై ముద్రిస్తున్నా జనం మారడం లేదు. వాటికి అలవాటుపడిన వారు వ్యసనాన్ని వదలడం లేదు. కానీ అలవాటు ఊపిరితిత్తులను పొగతో కమ్మేసి క్రమంగా క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతోంది. ధూమపానంతో వాహనాలు, పరిశ్రమలు వెదజల్లే పొగ కాలుష్యంగా మారి మనిషి ప్రాణాలు తీస్తోంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ రావడానికి గల కారణాలు, తీసుకునే చికిత్సలపై అవగాహన పెంచేందుకు ఏటా ఆగస్టు ఒకటో తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కథనం. – కర్నూలు(హాస్పిటల్)



క్యాన్సర్ ఇదో భయంకర మహమ్మారి. 50 ఏళ్ల క్రితం వరకు ఎక్కువగా ధనికులకు మాత్రం వచ్చే ఈ వ్యాధి ఇప్పుడు పేద, మధ్యతరగతి వర్గాలను వదలడం లేదు. ఏటా క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. వ్యాధి నిర్ధారణ అవకాశాలు సులభం కావడం కూడా సంఖ్య పెరగడానికి కారణమైంది. ఈ వ్యాధితో బాధపడిన వారు త్వరగా గుర్తించి చికిత్స తీసుకుంటే మనగలుగుతున్నారు. చివరి దశలో బయటపడితే మాత్రం ప్రాణాలు కోల్పోతున్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిరోజూ నిర్వహించే ఓపీకి 30 మంది దాకా రోగులు వస్తున్నారు. ఇందులో 20 మంది కొత్త వారే ఉంటున్నారు. అంటే ప్రతి నెలా 500 నుంచి 600 మంది, ఏడాదికి 6వేలకు పైగా కొత్తరోగులు పుట్టుకొస్తున్నారు. వీరిలో 6 శాతం మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇక్కడికి వచ్చే వారిలో అధిక శాతం మూడవ దశ, నాల్గవ దశలలో చికిత్స కోసం వస్తుండగా ఎక్కువ మంది కోలుకోలేక మరణిస్తున్నారు. ఈ క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో ఇద్దరు సర్జికల్ అంకాలజిస్టులు ఉన్నారు. వీరు ఊపిరితిత్తుల్లో ఏర్పడిన క్యాన్సర్ కణితులను తొలగించడం, దెబ్బతిన్న ఊపిరితిత్తిలోని కొంత భాగాన్ని తీసివేయడం చేసి అనంతరం కీమోథెరపి చికిత్స అందిస్తున్నారు. ఈ ఆసుపత్రితో పాటు కర్నూలు నగరంలోని ఒమెగా హాస్పిటల్, విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, అమీలియో క్యాన్సర్ హాస్పిటల్ లలోనూ ఎన్‌టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా క్యాన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లోనూ ప్రతిరోజూ కొత్త, పాత రోగులు 150 నుంచి 200 మంది చికిత్స కోసం వస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతున్న రోగులు

ప్రాణాలు తోడేస్తున్న పొగ

స్నేహితులతో సరదాగా మొదలయ్యే పొగతాగే అలవాటు క్రమంగా అలవాటుగా మారి ఆ తర్వాత బానిసను చేసుకుంటుంది. దీనిని వదిలించుకుందామన్నా వదలలేని పరిస్థితిలో చాలా మంది ఉన్నారు. కొందరు రోజుకు ఒక ప్యాకెట్/కట్ట తాగుతుండగా మరికొందరు నాలుగైదు పెట్టెలు కాల్చందే మనసు ఊరుకోని పరిస్థితి. ధూమపానం చేసేవారిలో చేయని వారికంటే ఊపరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం 24 నుంచి 35 రెట్లు ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. వారు వదిలిన గాలి పీల్చడం(పాసివ్ స్మోకింగ్) ద్వారా 3.5శాతం క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీంతో పాటు గాలి కాలుష్యం, గతంలో చేసిన రేడియేషన్ థెరపి, వంటచేసే సమయంలో ఉత్పత్తి అయ్యే రాడన్ గ్యాస్ పీల్చడం, ఆర్సెనిక్ క్రోమియం, నికెల్ ఆస్బెస్టాస్, ఇతర పదార్థాలు పీల్చడం ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

వ్యాధి లక్షణాలు–సంకేతాలు

ఊపిరితిత్తుల క్యాన్సర్ సాధారణంగా దాని ప్రారంభ దశలలో సంకేతాలు, లక్షణాలను కలిగించదు. వ్యాధి తీవ్రత ఎక్కువయ్యే కొద్దీ చికిత్సకు లొంగే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. నిరంతర దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం, శ్వాస ఆడకపోవడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గిపోవడం, ఎముకల నొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం లక్షణాలు ఉంటాయి.

వ్యాధి నిర్ధారణ, చికిత్స

ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశమున్న వారు ఏడాదికి ఒకసారి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. లక్షణాలను బట్టి వైద్యుల సూచనల మేరకు ఛాతి ఎక్స్‌రే, ఛాతి సీటీ స్కాన్, కఫం సైటోలజీ పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ రకాన్ని గుర్తించేందుకు టిష్యూ బయాప్సీ అవసరం అవుతుంది. చికిత్స ఆ క్యాన్సర్ దశపై ఆధారపడి ఉంటుంది. ఈ క్యాన్సర్‌కు ప్రస్తుతం శస్త్రచికిత్స, కీమోథెరపి, రేడియోథెరపి విధానాల్లో చికిత్స అందిస్తున్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్ రకాలు

స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్: ఇది చిన్న కణాల ఊపిరితిత్తుల క్యాన్సర్, దాదాపుగా ఎక్కువగా ధూమపానం చేసేవారిలో ఇది సంభవిస్తుంది.
నాన్ స్మాల్ సెల్ క్యాన్సర్: ఇది ఊపిరితిత్తుల క్యాన్సర్‌లలో వివిధ రకమైన క్యాన్సర్‌లు ఉంటాయి.(క్యామాసెల్ క్యాన్సర్, అడెనోకార్సినోమా, పెద్ద కణ క్యాన్సర్).

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పెరిగిన రోగులు



కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఇన్సిట్యూట్‌లో అన్ని సౌకర్యాలు, వసతులు సమకూర్చాక రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. పాత క్యాన్సర్ భవనంలో రోజుకు 10 నుంచి 15 రాగా ఇప్పుడు 25 నుంచి 30 మంది దాకా వస్తున్నారు. అందుబాటులో ఉన్న 120 పడకలు నిత్యం రోగులతో నిండిపోతున్నాయి. 80 శాతం మంది అడ్వాన్స్ (చివరి దశ)లో వస్తున్నారు. ముందుగానే గుర్తిస్తే క్యాన్సర్ చికిత్స సులభం అవుతుంది.

– డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, క్యాన్సర్ విభాగం హెచ్‌ఓడి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ధూమపానం, కాలుష్యం కారణాలు



ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ధూమపానం, వాయు కాలుష్యం ప్రధాన కారణాలు. ధూమపానం మానేస్తే చాలా వరకు ఈ క్యాన్సర్ నుంచి బయటపడవచ్చు. ధూమపాన నివారణ కోసం నికోటిన్ ఉత్పాదక స్థాపన ఉత్పత్తులు, మందులు, సహాయక సమూహాలు ఉన్నాయి. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్న 50 నుంచి 80 సంవత్సరాల వయస్సు గల పెద్దలు ప్రతి సంవత్సరం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి.

– డాక్టర్ సి. వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, కర్నూలు

ఉద్యోగ విరమణ రోజే మృతి



వసుంధర (ఫైల్)

గుంతకల్లు రూరల్: వైద్య, ఆరోగ్య శాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వసుంధర గురువారం తన స్వగృహంలో మృతి చెందారు. గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ఆమె విడపనకల్లు పీహెచ్‌సీ, కర్నూలు జిల్లా పగిడిరాయి పీహెచ్‌సీలో పని చేశారు. ప్రస్తుతం పత్తికొండ మండలం పుచ్చకాలమాడ పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. సర్వీసు పూర్తి కావడంతో గురువారం ఆమె ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంది. అయితే గత కొద్ది రోజులుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వసుంధర.. ప్రస్తుతం ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం కర్నూలు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ఇతర సిబ్బంది ఆమె ఇంటికి చేరుకుని పరామర్శించి వెళ్లారు. వారు వెళ్లిన కొద్దిసేపటికే మధ్యాహ్నం 1.30 గంటలకు కన్నుమూశారు.

తాటి చెట్టు చెప్పెను.. వానల్లేవని!



అప్పుడు

ఎందుకో.. ఏమో వరుణుడు మొహం చాటేశాడు. రోజూ ఆకాశంలో కమ్ముకుంటున్న మబ్బులు వర్షిస్తాయని అనుకుంటుండగానే కాసేపటికే మాయమవుతున్నాయి. నీటి కోసం చెరువులు నోరెళ్లబెట్టాయి. వేసవిలో ఎండిన వాగులు, వంకలు కుంటలు నీళ్ల కోసం అర్రులు చాస్తున్నాయి. ఇందుకు తమ్మరాజుపల్లె గ్రామం వద్ద ఎస్ టర్నింగ్ వద్ద ఉన్న జాతీయ రహదారి పక్కన ఉన్న కుంటనే నిదర్శనం. గతేడాది జూలై మొదటి వారంలోనే ఈ కుంట నిండటంతో మూగజీవాల దాహార్తి తీరింది. ప్రస్తుతం ఎండిపోయిన కుంటలో ఎత్తైన తాటి చెట్టు వరుణుడు కరుణ కోసం ఆకాశం వైపు చూస్తున్నట్లుగా కనిపిస్తోంది.

– పాణ్యం



ఇప్పుడు

జర్మనీ భాష శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

కర్నూలు(అర్బన్): జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలకు వీలుగా జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారిణి బి.రాధిక తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం డిగ్రీ అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 4లోగా dydir.sw.kml@gmail.comకు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు ఎం.శశికుమార్ (సెల్: 8121261727, 08518- 230790)ను సంప్రదించాలన్నారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి కేంద్రాల్లో మొత్తం 150 మంది మహిళలకు శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు ముందుగా Naipunyam AP పోర్టల్‌లోని https://naipunyam.ap.gov.in/ user registration? pageprogaram regirtration, ఇందులో Traineeregistration ఎంపిక చేసి, ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా లాగిన్ అయి రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి. అనంతరం అందుబాటులో ఉన్న శిక్షణా ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకొని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ప్రక్రియను ఈ నెల 6వ తేదీలోగా పూర్తి చేసుకోవాలన్నారు.

మూత'బడి'



జాప్లాతండాలో మూతపడిన బడి

తుగ్గలి: మండలంలోని జాప్లాతండా ప్రాథమిక పాఠశాల మూతపడింది. గత విద్యా సంవత్సరం వరకు నలుగురు విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో ముగ్గురు విద్యార్థులు పత్తికొండలో చేరగా రెండో తరగతి విద్యార్థిని ఒక్కరే మిగిలారు. దీంతో పాఠశాల మూతపడింది. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు కూడా బదిలీపై వెళ్లారు. దీంతో ఉన్న ఒక్క విద్యార్థిని పక్కగ్రామమైన లక్ష్మీతండా ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు చేర్పించారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే తిరిగి పాఠశాల తెరుచుకునే అవకాశం ఉందని ఎంఈవో-2 రామవెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుదాం

డోన్ టౌన్: ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై పోరాడేందుకు ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుదామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. నంద్యాల జిల్లా రెండవ మహా సభలో భాగంగా రెండవ రోజు గురువారం మార్కెట్‌యార్డు సమీపంలోని క్రిష్టియన్ హాలులో జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాది పాలనలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నాయన్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాడదామన్నారు. పేదలకు ఇంటి స్థలాలు వంకల్లో వాగుల్లో ఇస్తూ.. బడా బాబులకు పట్టణం నడిబోడ్డున, విలువైన భూములు అప్పనంగా అప్పజెబుతున్నారని ఆరోపించారు.



నూతన కార్యవర్గంతో రాష్ట్ర నాయకులు

నూతన కమిటీ: సమావేశం అనంతరం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా రంగనాయుడు రెండవ సారి ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా బాబా ఫక్రుద్దీన్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులుగా 15 మందిని, జిల్లా సమితి సభ్యులుగా 40 మందిని ఎన్నుకున్నారు. ఇందులో డోన్‌కు చెందిన కౌన్సిలర్ సుంకయ్య, రాధాకృష్ణ, రఘురామమూర్తి, ప్రసాద్, భాస్కర్, నాగరాము డు, రమేష్, మోటా రాముడు, నారాయణ ఎన్నికయ్యారు.

కుక్కను తప్పించబోయి..!

- మహిళా టీచర్ దంపతులకు గాయాలు

కర్నూలు సిటీ: నగర శివారులో జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళా టీచర్ దంపతులు గాయపడ్డారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపుల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ టీచర్‌గా ఇందిర పని చేస్తున్నారు. గురువారం ఉదయం ఆమె భర్త భాస్కర్‌తో కలసి బైక్‌పై పాఠశాలకు బయలుదేరారు. వెంకాయపల్లె సమీపంలోని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ దాటిన తర్వాత పెట్రోల్ బంక్ ఎదురుగా ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి భార్యాభర్తలు కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇందిర తలకు తీవ్ర గాయాలు కావడంతో మాట్లాడలేని పరిస్థితులో ఉంది. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శ్యామూల్ పాల్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు ఆసుపత్రికి చేరుకుని గాయపడిన దంపతులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి అధికారులను కోరారు. ఇందిర పరిస్థితి కొంత విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన భర్త భాస్కర్ జనరల్ హాస్పిటల్‌లోనే చికిత్స పొందుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళా టీచర్‌ను పరామర్శిస్తున్న డీఈఓ ఎస్.శ్యాముల్ పాల్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు

హాస్టల్‌లో కనీస వసతులు కరువు

సంజామల: బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో కనీస వసతులు కరవయ్యాని బనగానపల్లె నియోజకవర్గ విద్యార్థి విభాగ అధ్యక్షుడు శ్రీనువాసులు విమర్శించారు. స్థానిక బీసీ వెల్ఫేర్ హాస్టల్‌ను వైస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు గురువారం సందర్శించారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులు హాస్టల్ చుట్టూ ప్రహరీ లేక పోవడంలో ఇబ్బందిగా ఉందని తెలిపారు. శ్రీనువాసులు మాట్లడుతూ..కూటమి ప్రభుత్వం విద్యార్థులకు కనీసం వసతులు కూడా కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. కనీసం విద్యార్థులకు దుప్పట్లు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని మండిపడ్డారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసికెళ్లి విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బనగానపల్లె,అవుకు మండలా అధ్యక్షులు నీలి శివకృష్ణ, కునుకుంట్ల కార్తీక్, నాయకులు కుపేంద్ర రెడ్డి, కునుకుంట్ల విగ్నేష్,జాకీర్ పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం నాయకులు

ఫేక్ ట్రైనర్‌పై విచారణ

ఆలూరు: అరికెర గ్రామ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనర్ పేరుతో ఇటీవల విద్యార్థులు, ఉపాధ్యాయులను మోసం చేసిన వైనంపై డీసీఓ శ్రీదేవి విచారణ చేపట్టారు. స్కౌట్ అండ్ గైడ్స్ ట్రైనర్ పేరుతో ఓ వ్యక్తి పాఠశాలలో వసూళ్లకు పాల్పడిన ఘటనపై సాక్షిలో ఈనెల 30వ తేదీన కథనం ప్రచురితమైయింది. ఈ మేరకు గురువారం ఆమె పాఠశాలను తనిఖీ చేసి ఈ విషయంపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో విడివిడిగా సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వారంలోగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ నియామకం జరుగుతుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఫేక్ ట్రైనర్ విషయంపై విచారణ జరుగుతుందన్నారు.



అరికెర గ్రామ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీసీఓ శ్రీదేవి

వ్యక్తికి తీవ్ర గాయాలు

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడు శివారులో గురువారం ఉద యం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆళ్లగడ్డ మున్సిపల్ పరిధిలోని పడకండ్ల చెందిన ఓబులేసు కోవెల కుంట్ల నుంచి సొంతూరుకు వెళ్తుండగా దొర్నిపాడు శివారులో తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఓబులేసుకు రెండు కాళ్లు విరగడంతో పాటు తలకు గాయమై అపస్మారక స్థితిలో ఉన్నాడు. అదే సమయంలో ఆ రహదారి మీదుగా ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సంఘటన స్థలంలో నిలిచి ప్రమాదం ఆరా తీశారు. క్షతగాత్రుడిని ఆళ్లగడ్డ వైద్యశాలకు ఆటలో వెళ్లేలా చేశారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం ఎవరూ చెప్పలేక పోతున్నారు. ఈ మేరకు దొర్నిపాడు పోలీసులు విచారణ చేపట్టారు.

ఉయ్యాలవాడలో పొలం బాట పట్టిన మోడల్‌స్కూల్ విద్యార్థులు



పొలానికి వెళ్లి నాట్లు వేసి



రైతు పొలంలో వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

తరగతి గదుల్లో రోజూ పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు పొలం బాట పట్టారు. విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై ఆసక్తి కల్పించేంచడంతో పాటు, రైతుల వ్యయప్రయాసలు, సాగు తదితర వివరాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు గురువారం విద్యార్థులను పొలానికి తీసుకెళ్లారు. వరి నాట్లు వేసి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మోతాదులో రసాయనిక ఎరువులు, వరి మొక్క నాణ్యత, నీటి వినియోగం, తదితర విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. వీరి వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, ట్రైనర్ హుసేన్‌వలి ఉన్నారు.

– ఉయ్యాలవాడ